క్లుప్తంగా

యూటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక




అప్పారావు, శివశ్రీ

రావికమతం: యూటీఎఫ్ మండల నూతన కార్యవర్గం శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. రావికమతంలో జరిగిన ఈ ఎన్నికలకు పరిశీలకుడిగా ఆ సంఘ జిల్లా కార్యదర్శి సతీష్ వ్యవహరించారు. మండల గౌరవాధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు, అధ్యక్షుడిగా పోలిన అప్పారావు, సహాయ అధ్యక్షుడిగా బి.అప్పలనాయుడు, కె.గౌరి, ప్రధాన కార్యదర్శిగా ఎం.శివశ్రీ, కోశాధికారిగా మట్టా అప్పారావు, కార్యదర్శులుగా జి.నాగేశ్వరరావు, బి.ఎర్రయ్య, రాజేష్, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా కోటేశ్వరరావు, జిల్లా కౌన్సిలర్లుగా యు.వి. రమణమూర్తి, జి.శ్రీను ఎన్నికయ్యారు.

రోడ్డు మరమ్మతులు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న ఎం. కోటపాడు, ఎం.కె.వల్లాపురం గ్రామస్తులు

మాడుగుల రూరల్: ఘాట్‌రోడ్డు నుంచి వడ్డాది వరకు ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులమయంగా మారిందని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ ఎం. కోటపాడు, ఎం.కె. వల్లాపురం గ్రామస్తులు శుక్రవారం ధర్నా చేపట్టారు. పెద్ద పెద్ద గోతులు ఉండటంతో నిత్యం ప్రమాదాలకు గురవుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. గంట సేపు ధర్నా చేయడంతో రహదారికిరువైపులా ట్రాఫిక్ స్తంభించిపోయింది. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ పి.దామోదర్‌నాయుడు ఆందోళనకారులకు నచ్చచెప్పి ధర్నాను విరమింపజేశారు.

రామాలయం ప్రారంభం




సీతారాముల వారిని దర్శించుకుంటున్న వైస్ ఎంపీపీ రాజారామ్

మాడుగుల: సాగరం కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయాన్ని శుక్రవారం ఉదయం గ్రామస్తులు ప్రారంభించారు. ఎన్నోయేళ్ల నాటి కల ఫలించిందని ఈ సందర్భంగా వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ముందుగా సీతారాముల వారి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్, సర్పంచ్ జయమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాము వెంకటరావు, గుమ్మాల కొండలరావు, గింజాన దేములు, సన్యాసి నాయుడు, తదితరులు దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నసమారాధన ఏర్పాటు చేశారు.

హెల్పర్ పోస్టుకు ఇంటర్వ్యూ నేడు

నర్సీపట్నం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధి మున్సిపాలిటీలోని బలిఘట్టం అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీ హెల్పర్ పోస్టుకు శనివారం ఆర్డీవో కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని సీడీపీవో మేరీ సువార్త తెలిపారు. ఈ ఇంటర్వ్యూకు హాజరయ్యే అభ్యర్థులు ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు.

25 ఏళ్ల నాటి రోడ్డు సమస్యకు పరిష్కారం



రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ శిరీష

నాతవరం: చెర్లోపాలెం పంచాయతీ శివారు సీతారాంపురం, పార్వతీపురం గ్రామాల మధ్య పొంత రోడ్డు నిర్మాణంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు. ఇటీవల సర్పంచ్ పైల శిరీష రూ.10 లక్షలతో ముందుగా గ్రావెల్ రోడ్డు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డును శుక్రవారం వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ చెర్లోపాలెం దిగువ గ్రామ సరిహద్దు నుంచి సీతారాంపురం, పార్వతీపురం గ్రామాల మధ్య పొంత రోడ్డును బాగు చేయాలని 25 ఏళ్లుగా కోరుతున్నారన్నారు. ఈ నేపథ్యంలో గత టీడీపీ పాలకులు ఇచ్చిన హామీ బుట్టదాఖలైందని దుయ్యబట్టారు. ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ సహకారంతో యుద్ధప్రాతిపదికన ఈ రోడ్డు వేశామన్నారు. పంచాయతీ కార్యదర్శి, అధికారులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళలకు సీఎం ఆర్థిక తోడ్పాటు

- సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం



దేవరాపల్లి: సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి, మహిళలు



మాడుగుల రూరల్: కె.జె.పురంలో మాట్లాడుతున్న సర్పంచ్ రమణబాబు



బుచ్చెయ్యపేట: వడ్డాదిలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రాంబాబు

దేవరాపల్లి: వైఎస్సార్ ఆసరా పథకంతో పొదుపు సంఘాల మహిళలకు సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆర్థిక తోడ్పాటునందించారని ఎంపీపీ కిలపర్తి రాజేశ్వరి తెలిపారు. వైఎస్సార్ క్రాంతి పథం(వెలుగు) ఏపీఎం ఎస్. ప్రభాకర్ ఆధ్వర్యంలో దేవరాపల్లిలో వైఎస్సార్ ఆసరా ముందస్తు సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ఎంపీడీవో సిహెచ్. సుబ్బలక్ష్మి, ఈవోపీఆర్డీ కె. ఉషశ్రీ, సర్పంచ్ సబ్బవరపు పెంటమ్మ, డ్వాక్రా మహిళలతో కలిసి ఆమె సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ మూడో విడత ఆసరాలో మండలంలోని 995 గ్రూపుల్లో 10,538 మంది సభ్యులకు 5 కోట్ల 68 లక్షల 96 వేల 465 రూపాయలు లబ్ధి చేకూరుతుందన్నారు. సచివాలయ సెక్రటరీ రత్నం పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధి సీఎం ధ్యేయం

బుచ్చెయ్యపేట: మహిళల ఆర్థిక పురోభివృద్ధి సాధించాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని జెడ్పీటీసీ దొండా రాంబాబు తెలిపారు. మూడో విడత వైఎస్సార్ ఆసరాలో భాగంగా వడ్డాది మేజరు పంచాయతీలో శుక్రవారం డ్వాక్రా మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం సీఎం జగన్ డ్వాక్రా రుణాల వడ్డీ మాఫీ చేస్తున్నారన్నారు. వడ్డాదిలో 183 డ్వాక్రా సంఘాల్లో 2,084 మంది సభ్యులకు మొత్తం రూ.4.64 కోట్లు వారి ఖాతాల్లో జమ కానుందన్నారు. వైఎస్సార్‌సీపీ వడ్డాది టౌన్ అధ్యక్షుడు దొండా నారాయణమూర్తి, మాజీ వైస్ ఎంపీపీ దాడి సూరినాగేశ్వరరావు, నాయకులు కోరుకొండ సూరి అప్పారావు, కోరుకొండ రమణ, ఏపీఎం బాలరాజు, ఈవో లోవరాజు, సీసీ కొండయ్య పాల్గొన్నారు.

వైఎస్సార్ ఆసరాతో డ్వాక్రాలకు మేలు

రోలుగుంట: వైఎస్సార్ ఆసరాతో డ్వాక్రాలకు ఎంతో మేలు కలుగుతుందని జెడ్పీటీసీ సభ్యురాలు పోతల లక్ష్మీ రమణమ్మ తెలిపారు. స్థానిక పాత రామమందిరం వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రోలుగుంట సచివాలయం పరిధిలోని 130 సంఘాలకు మూడు దఫాలుగా రూ. 2.82 లక్షలు మాఫీ అయిందన్నారు. ఏపీఎం సాధన మాట్లాడుతూ మూడో దఫా 130 సంఘాల్లో 1,123 మంది సభ్యులకు వర్తిస్తుందన్నారు. ఆసరా సొమ్ము నిరుపయోగమైతే సంఘాల అభివృద్ధికే నష్టం కలుగుతుందన్నారు. సామాజిక కార్యకర్తలు పద్మ, భవానీ, పరమేశ్ పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: కె.జె.పురం గ్రామ సచివాలయంలో శుక్రవారం డ్వాక్రా సభ్యులతో సమావేశం నిర్వహించారు. మూడో విడత ఆసరా కింద కె.జె. పురం మూడు వీవోల పరిధిలో 121 సంఘాలకు 88 లక్షల 19 వేల 819 రుపాయలు జమ కానుందని క్లస్టర్ కోర్ పర్సన్ శ్రీనివాసరావు తెలిపారు. సర్పంచ్ జామి రమణబాబు, పంచాయతీ కార్యదర్శి పెంకి శివ, నాయకులు కాళ్ల రాము, కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, ఆడారి గణేశ్ మాట్లాడారు.

వీరనారాయణంలో..

వీరనారాయణం రెండు గ్రామైక్య సంఘాల పరిధిలోని 63 సంఘాల్లో సభ్యులుకు 41 లక్షల 25 వేల 704 రుపాయలు మూడో విడత ఆసరా సొమ్ము జమ కానుందని వెలుగు సీసీ గణపతి తెలిపారు. స్థానిక రామాలయంలో మహిళలతో సమావేశం నిర్వహించారు. సర్పంచ్ కొండప్పారావు, ఎంపీటీసీ దాడి నూకరత్నం, వీవోఏలు కాళ్ల బాలకృష్ణ, లావణ్య పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం



శంకుస్థాపనలో పాల్గొన్న తామరం గ్రామస్తులు

మాకవరపాలెం: తామరంలోని రామాంజనేయ ఆలయ నిర్మాణానికి శుక్రవారం గ్రామస్తులు శంకుస్థాపన చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి టీటీడీ రూ.10 లక్షలు మంజూరు చేసింది. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి, తూర్పుకాపు సంఘం మండలాధ్యక్షుడు గొంతిన హరిబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ అయ్యన్న, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నాగాపురంలో ...

గొలుగొండ: నాగాపురంలో సీతారామాలయం నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ యలమంచిలి రఘురాం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. తిరుమల తిరుపతి దేవస్థానం మంజూరు చేసిన రూ.10 లక్షలతో ఆలయం నిర్మించనున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

5న చలో ఢిల్లీ జయప్రదం చేయండి



ఆనందపురంలో కార్మికులతో కలిసి మాట్లాడుతున్న నాయినిబాబు

కె.కోటపాడు: 44 కార్మిక చట్టాలను యధావిధిగా కొనసాగించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు గండి నాయినిబాబు కోరారు. ఆనందపురంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 5న తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమానికి కార్మికులు, రైతులు పెద్ద ఎత్తున హాజరు కావాలని కోరారు. కార్మిక చట్టం అనుసరించి కార్మికులకు నెలకు రూ.26 వేల కనీస వేతనం అమలు చేయాలన్నారు. పార్టీ మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు మాట్లాడుతూ ఏటా 200 రోజులకు ఉపాధి పనులు పెంచి రోజు కూలి రూ.600 చెల్లించాలని కోరారు. కార్మికులు గుమ్మయ్య, బోజంకి రమేష్, వేచలపు ఈశ్వరరావు, కర్రి కన్నయ్య పాల్గొన్నారు.



సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని అసెంబ్లీ లాబీలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు ఈర్లె అనురాధ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల తనకు పదవి బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆమె వెంట డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ఉన్నారు. - కె.కోటపాడు

నిక్షయ పోషణ యోజన అమలు లక్ష్యం

- గ్రామాల్లో అవగాహన ర్యాలీలు
- క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా చికిత్స



చోడవరం రూరల్: కొత్తూరు జంక్షన్‌లో క్షయ నివారణ మానవహారం



మాకవరపాలెం: కొండలఅగ్రహారంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది



నర్సీపట్నం: మానవహారంగా ఏర్పడి నినాదాలు చేస్తున్న విద్యార్థులు

చోడవరం రూరల్: క్షయ వ్యాధిని రూపుమాపాలన్న లక్ష్యంతోనే నిక్షయ పోషణ యోజన అమలవుతుందని చోడవరం ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి వినయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం చోడవరం టీబీ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలోని క్షయ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ ఆస్పత్రి వద్ద ఈ ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. నిక్షయ పోషణ పథకం ద్వారా క్షయ రోగికి నెలకు రూ.500 లెక్కన ఆర్నెల్లకు రూ.3 వేలు ప్రభుత్వం వారి ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని విలేజ్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ల ద్వారా క్షయ రోగులకు నిరంతరం పరిశీలన, డాట్ పద్ధతి ద్వారా చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. కొత్తూరు కూడలిలో మానవహారంగా ఏర్పడి క్షయ నివారణ ప్రతిజ్ఞ చేపట్టారు. ఎంపీహెచ్‌ఎస్‌లు, ఏఎన్‌ఎంలు, ఐసీటీసీ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సీపట్నం: క్షయ వ్యాధి పట్ల అప్రమత్తంగా ఉండాలని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ జె.ప్రశాంతి అన్నారు. పట్టణంలోని ఐదు రోడ్ల జంక్షన్‌లో జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు శుక్రవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్షయ వ్యాధి వ్యాప్తి, లక్షణాలు గురించి ఈ సందర్భంగా ఆమె వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నం, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాకవరపాలెం: క్షయ వ్యాధిని తరిమికొట్టేందుకు అందరూ కృషి చేయాలని వైద్యాధికారి శ్రీవిద్య కోరారు. కొండలఅగ్రహారంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి క్షయ నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వ్యాధి లక్షణాలపై నినాదాలు చేశారు. వైద్యాధికారి సీతారామలక్ష్మి, సీహెచ్‌వో రమేష్, ఎంపీహెచ్‌ఈవోలు జాన్సన్, గంగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

మాడుగుల రూరల్: ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం కె.జె.పురంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మందులు వాడకంతో టీబీని పూర్తిగా నివారించవచ్చునని పీహెచ్‌సీ వైద్యాధికారి లీలాప్రసాద్ తెలిపారు. ఎంపీహెచ్‌ఈవో పి. రవికుమార్, హెచ్‌వీ పుష్పకాంతం, టీబీ సూపర్‌వైజర్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు: చౌడువాడ పీహెచ్‌సీలో శుక్రవారం క్షయ వ్యాధిపై గ్రామస్తులకు వైద్యాధికారి ప్రశాంత్ అవగాహన కల్పించారు. రెండు వారాలకుపైగా కఫంతో కూడిన దగ్గు, బరువు తగ్గడం, జ్వరం వస్తే పరీక్షించుకోవాలని సూచించారు. ఎంపీహెచ్‌ఈవో కె.వి.రాజశేఖర్, సీహెచ్‌వో సింహాచలం, పీహెచ్‌ఎన్ కనకవేణి పాల్గొన్నారు.

ఉత్సాహంగా వీడ్కోలు వేడుక



ముషిడిపల్లి హైస్కూల్‌లో విద్యార్థినుల నృత్య ప్రదర్శన

దేవరాపల్లి: బీఆర్ అంబేడ్కర్‌ను, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాంను ఆదర్శం తీసుకుని ప్రణాళికాబద్ధంగా చదివి పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లిలక్ష్మి ఆకాంక్షించారు. ఏ. కొత్తపల్లి హైస్కూల్‌లో హెచ్‌ఎం వై. స్వర్ణలత ఆధ్వర్యంలో ఘనంగా పాఠశాల వార్షికోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. టెన్త్ విద్యార్థులకు ఘన వీడ్కోలు పలికారు. వీరికి పరీక్ష మెటీరియల్ పంపిణీ చేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముషిడిపల్లిలో..

ముషిడిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు తొమ్మిదో తరగతి విద్యార్థులు, ఉపాధ్యాయులు శుక్రవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. హెచ్‌ఎం ఉదయ్‌భాస్కర్, ఉపాధ్యాయుడు పెద్దాడ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కె.జె.పురంలో..

మాడుగుల రూరల్: పాఠశాల కమిటీ చైర్మన్ మళ్ల కిశోర్ ఆధ్వర్యంలో కె.జె.పురం హైస్కూలులో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు వేడుక ఉత్సాహంగా జరిగింది. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. పది విద్యార్థులకు పరీక్ష మెటీరియల్‌ను పంపిణీ చేశారు. హెచ్‌ఎం వి. దాసు, సర్పంచ్ జామి రమణబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు కాళ్ల రాము, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కాళ్ల అప్పలనాయుడు, మళ్ల కన్నబాబు, స్కూలు కమిటీ మాజీ అధ్యక్షుడు ఆడారి గణేశ్, ఎంపీపీ పాఠశాల కమిటీ చైర్మన్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

సొంత నిధులతో శ్మశాన వాటిక అభివృద్ధి



భూమి పూజా కార్యక్రమంలో శ్రీనివాసరావు, కోటేశ్వరరావు

కె.కోటపాడు: ఎ.కోడూరు శ్మశాన వాటిక అభివృద్ధి పనులకు దాతలు శుక్రవారం భూమిపూజ చేశారు. తన తండ్రి పైడంనాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమారుడు పాటూరి శ్రీనివాసరావు రూ.4 లక్షల సొంత నిధులతో ఇక్కడ దహన వాటిక నిర్మాణానికి చర్యలు చేపట్టారు. మాజీ సర్పంచ్ లెక్కల మల్లేశ్వరరావు, కోటేశ్వరరావు, కొండలరావు, తాతబాబు, వాసిరెడ్డి విజయ్‌కుమార్ సొంత నిధులతో వెయిటింగ్ హాల్ నిర్మిస్తున్నారు. వీరిని గ్రామస్తులు అభినందించారు. వైఎస్సార్‌సీపీ కన్వీనర్ బొడ్డు ప్రకాశమ్మ, ఎంపీటీసీ లెక్కల గౌతమి, శంకరరావు, సచివాలయ కన్వీనర్ బొడ్డు శ్రీను, భ్రమరాంబిక సహిత మల్లికార్జునస్వామి ఆలయ కమిటీ చైర్మన్ బొడ్డు మల్లునాయుడు, వార్డు మెంబర్ లెక్కల శ్రీధర్, నీటి సంఘం చైర్మన్ లెక్కల వెంకటరావు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు ఆరుగురు విద్యార్థులు ఎంపిక

రావికమతం: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్)కు మరుపాక మోడల్ స్కూల్, టి.అర్జాపురం, చినపాచిల హైస్కూల్‌కు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి నెలకు వెయ్యి చొప్పున ఇంటర్ పూర్తయ్యే వరకు మానవ వనరుల శాఖ నుంచి ఉపకార వేతనం అందుతుంది. కేంద్ర ప్రభుత్వ మానవ వనరుల శాఖ ఈ పరీక్షను ఏటా నవంబరులో నిర్వహిస్తోంది. ఎనిమిదో తరగతి విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతారు. ఆ విధంగా మండలం నుంచి ఈ ఏడాది 28 మంది హాజరుకాగా, వారిలో టి.అర్జాపురం హైస్కూల్ నుంచి డొంకా సాయిలోకేష్, చినపాచిల హైస్కూల్ నుంచి పసుపులేటి గాయిత్రి, మరుపాక మోడల్ స్కూల్ నుంచి పి.శ్యామ్, వి.లోక్‌నాథ్, ఐ.హర్షిత, ఎం.రహీన ఎంపికైనట్టు ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలు కె.ఆర్.ఎస్. నాయుడు, ప్రసన్నకళ, కె.సత్యసునీల్ శుక్రవారం తెలిపారు.

ఖండివరంలో పశు విజ్ఞాన బడి

చీడికాడ: పశువైద్యాధికారి గణేష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఖండివరంలో పశు విజ్ఞాన బడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాడుగుల ఏడీ వి. చిట్టినాయుడు మాట్లాడుతూ ఈ నెల 31వ తేదీ వరకు నాలుగు మాసాలు దాటిన ప్రతి పాడి పశువునకు టీకాలు వేయించాలని సూచించారు. పశువులు అనారోగ్యానికి గురైతే 1962 ట్రోల్ ఫ్రీ నంబరుకు ఫోన్ చేయాలన్నారు. పశుసంవర్ధక సహాయకుడు రిషికిరణ్, అంబులెన్స్ సిబ్బంది, కిశోర్, శంకర్ పాల్గొన్నారు.

ఆలయాలకు నిధులు మంజూరుపై హర్షం



తురకలపూడిలో దేవాలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: మండలంలోని ఎనిమిది గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలకు టీటీడీ నుంచి రూ.80 లక్షలు మంజూరు చేయడంపై వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ హర్షం వ్యక్తం చేశారు. తురకలపూడి, కొమ్మళ్లపూడి, పైడంపేట, గంటికొర్లాం, ఆర్. శివరాంపురం, చిన భీమవరం తదితర గ్రామాల్లో ఒక్కో దేవాలయానికి రూ.10 లక్షలు చొప్పున మంజూరయ్యాయన్నారు. ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషితో నిధులు మంజూరు చేసిన టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. శుక్రవారం ఆయా గ్రామాల్లో దేవాలయాల నిర్మాణాలను పరిశీలించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, సుంకరి శ్రీను, బాబ్జి పాల్గొన్నారు.

హుండీ ఆదాయం రూ.1.69 లక్షలు

చోడవరం: స్వయంభూ విఘ్నేశ్వరస్వామివారి ఆలయ హుండీ కానుకల లెక్కింపు గురువారం జరిగింది. దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, చోడవరం ఆలయాల సముదాయాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి.వి. సత్యనారాయణమూర్తి పర్యవేక్షణలో ఆలయ ప్రాంగణంలో హుండీ కానుకలు లెక్కింపు చేశారు. లక్షా 69 వేల 351 రూపాయల ఆదాయం వచ్చింది. మూడు నెలలకు సంబంధించి హుండీ కానుకలు లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



పోషకాహార ప్రదర్శనను తిలకిస్తున్న కౌన్సిలర్ నాని, సీడీపీవో మేరీ సువార్త



మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ లక్ష్మి

నర్సీపట్నం: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలు, పిల్లలు సంపూర్ణ ఆరోగ్యం కలిగి ఉంటారని సీడీపీవో మేరీ సువార్త తెలిపారు. పోష్టికాహార వారోత్సవాల్లో భాగంగా మున్సిపాలిటీ బీసీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహార స్టాళ్లను కౌన్సిలర్ సిరసపల్లి నాని ప్రారంభించారు.

గొలుగొండ: పప్పుశెట్టిపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఎంపీడీవో డేవిడ్‌రాజు పరిశీలించారు. పౌష్టికాహారం అందించకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మాకవరపాలెం: క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా తల్లీబిడ్డ ఆరోగ్యంగా ఉంటారని వైస్ ఎంపీపీ రుత్తల లక్ష్మి సూచించారు. తామరం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పౌష్టికాహారాన్ని ప్రదర్శించి అవగాహన కల్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు హరిబాబు, కార్యదర్శి బాలదొర పాల్గొన్నారు.

నాతవరం: బాలామృతం తీసుకున్న వారందరికీ రక్తహీనత సమస్య ఉండదని ఐసీడీఎస్ సూపర్‌వైజరు ఎ. విజయలక్ష్మి తెలిపారు. పోషణ్ పక్వాడాలో భాగంగా శుక్రవారం స్థానిక అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యకర్తలు సింగంపల్లి వరలక్ష్మి, మార్తి సత్యవతి, శెట్టి రాజేశ్వరి, ఎ. వసంత, ఎస్.పార్వతి పాల్గొన్నారు.

చోడవరం రూరల్: దాముసాపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్షోత్సవాల అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన ర్యాలీని సర్పంచ్ గోపిశెట్టి వసుంధర ప్రారంభించారు. సూపర్‌వైజర్ శ్రీదేవి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్త ఆర్.కామరాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మాడుగుల: సంపూర్ణ పోషకాహారంపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ఐసీడీఎస్ పీవో శ్రీదేవి తెలిపారు. శుక్రవారం ఒమ్మలిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సూపర్‌వైజర్ చిన్నమ్మలు, వీజేపురం, కృష్ణాపురం కేంద్రాల కార్యకర్తలు లక్ష్మీబాయి, పార్వతి, మేరీ, రమణమ్మ, రాజులమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దేవరాపల్లి: ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం చిననందిపల్లిలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలలో అధిక పోషకాలు లభిస్తాయని, వీటిని తీసుకోవాలని సర్పంచ్ పోతల చెల్లయ్యమ్మ సూచించారు. సచివాలయ, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.